## పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని ఫ్యాకల్టీలలో పీహెచ్‌డీ ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను అధికారులు సోమవారం విడుదల చేశారు. ఓయూలో కేటగిరి 2 ద్వారా పీహెచ్‌డీ ప్రవేశాలకు ఏప్రిల్ 25 నుంచి 27 వరకు కంప్యూటర్ ఆధారిత ప్రవేశపరీక్షలను వర్సిటీ నిర్వహించింది. మొత్తం 49 విభాగాల్లో ప్రవేశాలు పొందేందుకు 9,747 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 7,907 మంది పరీక్షలకు హాజరు కాగా, ఉత్తీర్ణత శాతం 62.60 గా నమోదయింది. ఈ సందర్భంగా ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. విభాగాల వారీగా అభ్యర్థుల ర్యాంకు కార్డులను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. ఈనెల 23 నుంచి పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ జాయింట్ డైరెక్టర్స్ ప్రొఫెసర్ జలపతి పాల్గొన్నారు.

## పేదల వైద్య సేవలకు సహకారం



లబ్ధిదారుకు ఎల్‌ఓసీ మంజూరు పత్రం అందజేస్తున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, జూన్ 9 : పేదల వైద్య సేవలకు తమ సహాయ, సహకారాలు అందిస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన అనిల్‌కుమార్, రాజేశ్వరిలు అనారోగ్యంతో సతమతమవుతుండగా.. ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ వారికి నాలుగున్నర లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ) పత్రాన్ని సీతాఫల్‌మండిలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నిరుపేదలకు నాణ్యమైన వైద్యం భారంగా మారిన దశలో వైద్య సేవలు పొందేందుకు తమవంతు సహకారాన్ని అందిస్తున్నామని అన్నారు. ప్రజలు అత్యవసర సందర్భాల్లో సీతాఫల్ మండిలోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

## దూరవిద్య ఎంబీఏ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి రామ్ రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్‌ఆర్ సీడీఈ) ద్వారా అందించే ఎంబీఏ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ మొదటి, మూడు సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 24 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

## పిల్లల చదువు భవితకు వెలుగు

### బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

### ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, జూన్ 9 : పిల్లల చదువు భవితకు వెలుగు అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా కవాడిగూడ చిత్రాల నర్సింహులు స్మారక ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ముఖ్య అతిథిగా హాజరైన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. కవాడిగూడ తాళ్ళబస్తీ పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ.. పలు బస్తీల్లో ప్రచారం నిర్వహిస్తూ బీమామైదాన్ వాంబే కాలనీ వరకు సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .. బడీడు పిల్లల్ని తప్పకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనాకుమారి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.పావన, ఉపాధ్యాయులు వంశీ, వీనా, వసంత, మమత, హేమలత, శిరీష, శైలజ, సౌజన్య, కిరణ్మయి, సుబ్రహ్మణ్యం, డాక్టర్ బయ్య నాగయ్య, అనిల్ కుమార్, సంధ్య, స్వప్న, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్యామ్‌యాదవ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, శంకర్, కిరణ్ పాల్గొన్నారు.



బీమామైదాన్ వాంబే కాలనీలో బడిబాట ప్రచారం నిర్వహిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కవాడిగూడ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



చిక్కడపల్లి,జూన్ 9 : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో నెస్టోరియా ఒరియా ఫౌండేషన్ , వాసన్ కేర్, అపోలో హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, ఫౌండేషన్ చైర్మన్ వీరలక్ష్మి, గూడూరి శ్రీనివాస్, రవి , గంగాధర్ రావు, వంశీ రామరాజు, సుజాత తదితరులు పాల్గొన్నారు.








## 'గాంధీ'లో తాగునీటి ప్లాంట్ ప్రారంభం



బన్సీలాల్ పేట్, జూన్ 9 : గాంధీ దవాఖానలో రోగుల కోసం మంచుకొండ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి ప్లాంట్‌ను సోమవారం సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి, మంచుకొండ ఫౌండేషన్ ట్రస్టీ వరుణ్ కుమార్‌లు ప్రారంభించారు. ఆరు 300 లీటర్ల ప్లాంట్‌లు, 20 వందల లీటర్ల వాటర్ కూలర్లను తమ ఫౌండేషన్ ద్వారా అందజేసినట్టు వరుణ్ కుమార్ తెలిపారు. వాటి నిర్వహణ బాధ్యత కూడా తమ ఫౌండేషన్ తీసుకున్నదని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ.. రోగులకు మంచినీటి కూలర్లు, వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన మంచుకొండ ఫౌండేషన్ సంస్థ సేవాభావాన్ని అభినందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో గాంధీ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవి శేఖర్ రావు, ఆర్‌ఎంఓ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, డాక్టర్ నవీన్, అడ్మిన్ మేనేజర్ శివరామిరెడ్డి, మంచుకొండ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ శ్రవణ్‌కుమార్, సిబ్బంది మల్లేశ్, సతీశ్ పాల్గొన్నారు.






## హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయకు సన్మానం

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ జీవిత చరిత్ర 'ప్రజల కథే నా ఆత్మ కథ' పుస్తక ఆవిష్కరణ సందర్భంగా సోమవారం మాజీ కార్పొరేటర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు వి.శ్రీనివాస్ రెడ్డి దత్తాత్రేయను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. అందరివాడు బండారు దత్తాత్రేయ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రేషం మల్లేశ్, సిరిగిరి శ్యామ్, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, కార్తీక్ యాదవ్, సిద్ధిక్, వెంకటేశ్, రాజేశ్, మహేందర్, అజ్జు పాల్గొన్నారు.
– చిక్కడపల్లి,జూన్ 9

## బుక్స్, యూనిఫామ్స్ దందా అరికట్టాలి


చిక్కడపల్లి,జూన్ 9: ప్రైవేటు కార్పొరేట్ స్కూళ్లలో బుక్స్, యూనిఫామ్స్ దందాను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజు దోపిడీ షురు అయిందన్నారు. నగరంలో ఏటా అడ్డగోలుగా పుట్టుకొస్తున్న పాఠశాలలు.. ఎలాంటి గుర్తింపుతో సంబంధం లేకున్నా.. రకరకాల పేర్లతో ఇష్టం వచ్చినట్టుగా ఫీజులు వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. అడ్మిషన్ నుంచి మొదలయ్యే దోపిడీ కాస్త, పిల్లలకు అందించే పుస్తకాలు, బెల్ట్, టై, బూట్లు, డ్రెస్సుల వరకు వారి వద్దే కొనాల్సి ఉంటుంది. ఇలా అధిక ఫీజులు వసూలు చేసే యాజమాన్యాలపై నిఘా పెట్టాల్సిన జిల్లా యంత్రాంగం వారిచ్చే మామూళ్లకు ఆశపడి చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నాయి విమర్శించారు. ఫలితంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఏటా ప్రతి ఏడాది నిలువు దోపిడీకి గురి కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు . కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్, నాగేందర్, శ్రీమాన్,స్టాలిన్ ,సహన సాయి, తదితరులు పాల్గొన్నారు.

## నల్లాలకు బిగించిన మోటర్లు సీజ్

సికింద్రాబాద్, జూన్ 9: అక్రమంగా నల్లాలకు మోటర్లు బిగించి నీటిని వాడుకుంటే జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని వాటర్ బోర్డు విజిలెన్స్ అధికారులు స్పష్టం చేశారు. వాటర్ బోర్డు విజిలెన్స్ డీఎస్పీ జ్ఞానేందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సురేశ్‌ల ఆదేశాల మేరకు సందీప్‌రెడ్డి టీంతో సోమవారం సికింద్రాబాద్ సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో నీటి సరఫరా సమయంలో తనిఖీలు నిర్వహించారు. శ్రీనివాస్‌నగర్ కాలనీలో నల్లా పైపులైనుకు నేరుగా మోటార్లు బిగించి నీటిని అక్రమంగా తోడుతున్న వినియోగదారులను గుర్తించి 6 మోటర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినియోగదారులు తమ నల్లాలకు మోటార్లు బిగించి పట్టుబడితే, వారిపై వాటర్‌బోర్డు నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి జరిమాన విధిస్తామని తెలిపారు. ఈ తనిఖీలు ఇలానే కొనసాగుతాయని వారు స్పష్టం చేశారు.

## జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి

## 'కంటోన్మెంట్' అధ్యక్షుడిగా శివకుమార్ యాదవ్



బొల్లారం,జూన్ 9 : గ్రేటర్ హైదరాబాద్ యాదవ హక్కుల పోరాట సమితి నూతన కమిటీ ఏర్పాటులో భాగంగా కంటోన్మెంట్ నియోజకవర్గ అధ్యక్షుడిగా బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శివకుమార్ యాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శివకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. యాదవ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. యాదవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.తనకు ఈ బాధ్యతను ఇచ్చిన జాతీయ అధ్యక్షుడు మేకల రాముడు యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రవి యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ యువజన అధ్యక్షుడు మారమోని శ్రీశైలం యాదవ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

## అవార్డుల ప్రదానోత్సవం

ముషీరాబాద్, జూన్ 9 : కురుగంటి కళాక్షేత్రం చారిటబుల్ ట్రస్ట్ 28వ వ్యవస్థాపక దినోత్సవం సోమవారం చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో ఘనంగా జరిగింది. సంస్థ వ్యవస్థాపకురాలు, కూచిపూడి నృత్య గురువు రాధిక పర్యవేక్షణలో 50 మంది శిష్యులు కుందనిక కళాకారుల బృందం ప్రదర్శించిన శ్రీకృష్ణ లీలామృతం కూచిపూడి నృత్య రూపక ప్రదర్శన ఆద్యంతం నేత్రపర్వంగా సాగింది. అనంతరం రత్న అవార్డులను డాక్టర్ చంద్రకాంతరావు, వేణుగంటి శ్రీధర్ ఆచార్య, ఎండీ రఫీ, వాణి రమణ, తమన్నా శ్రీలకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సింహనందిని నృత్య కళాకారిణి ఓలేటి రంగమణి, వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, మల్లేశ్వర్, నరేశ్, భరత్ కుమార్ పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం..

సికింద్రాబాద్, జూన్ 9 : మహ్మద్‌గూడ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని కార్పొరేటర్ హేమ పరిశీలించారు. పరీక్షలు నిర్వహించి.. పోషకాహారంపై కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం అవసరమైనవారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మహిళా నేతలు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జీబీరెడ్డికి సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ : కేరళ రాష్ట్రం, కొచ్చిలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ వైస్ చాన్సలర్‌గా ఇటీవల నియమితులైన ప్రొఫెసర్ జీబీ రెడ్డిని ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్ సోమవారం సన్మానించారు. ఈ నియామకంతో ఓయూ కీర్తి మరింత పెరిగిందని అధికారులు అభిప్రాయపడ్డారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్ పాల్గొన్నారు.

## స్టీల్‌షాప్‌లో అగ్ని ప్రమాదం

చిక్కడపల్లి, జూన్ 9: ఆజామాబాద్‌లోని స్టీల్ ఫ్యాక్టరీ గల్లీలో గల హిందుస్థాన్ స్టీల్ వరల్డ్ షాప్ లో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని మంట లను ఆర్పివేశారు. అగ్ని ప్రమాదంలో షాప్‌లోని ఫాల్ సీలింగ్, ఫ్యాన్లు, లైట్లు, స్టీల్ వంట సామగ్రి కొన్ని పాక్షికంగా, మరికొన్ని పూర్తిగా కాలిపోయాయి. షాపు యజమాని మహమ్మద్ ఇమ్రాన్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉండొచ్చని అనుమానిస్తూ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

## ఫుడ్ సేఫ్టీ పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు..

### నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి

### డెక్కన్ పామ్ రెస్టారెంట్‌లో ఆకస్మిక తనిఖీ ..

### కుళ్లిన ఆహారపదార్థాల గుర్తింపు..

ఉస్మానియా యూనివర్సిటీ: తార్నాక చౌరస్తాలో ఉన్న డెక్కన్ పామ్ రెస్టారెంట్‌లో నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కుళ్లిపోయిన చికెన్ ఉపయోగించి బిర్యానీ ప్రజలకు అందిస్తున్నారన్న ఫిర్యాదులపై స్పందించిన ఆమె.. రెస్టారెంట్లో సోదాలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా కుళ్లిన, అన్ హైజీనిక్ ఆహార పదార్థాలను గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె రెస్టారెంట్ యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులతో మాట్లాడిన ఆమె రెస్టారెంట్లో స్వాధీనం చేసుకున్న ఆహార పదార్థాలకు పరీక్షలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆహార నాణ్యత పాటించని అన్ని హోటళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. హోటల్స్, రెస్టారెంట్ల యజమానులు తగిన నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. నగరంలోని అన్ని రెస్టారెంట్లు, హోటల్స్, టిఫిన్ సెంటర్లలో ఫుడ్‌సేఫ్టీని పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.



డెక్కన్ పామ్ రెస్టారెంట్లో తనిఖీలు నిర్వహిస్తున్న డిప్యూటీ మేయర్

## టీయూసీఐ మహాసభలను జయప్రదం చేయండి

ముషీరాబాద్, జూన్ 9: టీయూసీఐ తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) పిలుపునిచ్చింది. సోమవారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎల్ పద్మ, ప్రవీణ్ మాట్లాడుతూ.. టీయూసీఐ కార్మిక సంఘం 14 రాష్ట్రాల్లో కార్మిక ఉద్యమాలను, సంఘాలను నిర్వహిస్తున్నదని, బడా కార్పొరేట్ కంపెనీల యూనియన్ వర్కర్లను ఆర్గనైజ్‌చేసి అనేక సమస్యలు పరిష్కరించిందన్నారు. నిజామాబాదులో జూన్ 21, 22 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర టీయూసీఐ ప్రథమ మహాసభను నిర్వహిస్తున్నామని, మొదటి రోజు వేలాదిమంది కార్మికులతో భారీ ప్రదర్శన ఉంటుందన్నారు. బహిరంగ సభలో ముఖ్య అతిథిగా టీయూసీఐ ఆల్ ఇండియా అధ్యక్షుడు అమ్రిష్ పటేల్ ప్రసంగిస్తారని, ప్రొఫెసర్ లింబాద్రి సభను ప్రారంభిస్తారని, మహాసభల విజయవంతానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హన్మేష్, జిల్లా ఆఫీస్ బేరర్స్ లింగం గౌడ్, శ్రీనివాస్, అఫ్జల్, ప్రదీప్, నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు జె.వెంకటేశ్, మెహర్ బేగం, టి.వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

ముషీరాబాద్, జూన్ 9: రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడంతో పాటు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో విద్య వ్యాపారాన్ని అరికట్టేలా ఫీజులు నియంత్రణ చట్టం అమలు చేయాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో పీడీఎస్‌యూ ఎస్వీ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి నాగరాజులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థల్లో సమస్యలను పరిష్కరించి వసతులు కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల మూసివేతను మానుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, చట్ట ప్రకారం 25 శాతం ఉచిత అడ్మిషన్లు ఇవ్వాలనే నిబంధన ఉన్నప్పటికీ ఈ ఒక్క ప్రైవేట్ పాఠశాలలో అమలు కావడం లేదని అన్నారు. విద్య వ్యాపారానికి పాల్పడుతున్న కార్పొరేట్ సంస్థల అనుమతులు రద్దు చేయకుండా విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో మహేశ్, భువనగిరి మధు, రాజేశ్వర్, మంద నవీన్, సంతోశ్, గౌతమ్ కుమార్ పాల్గొన్నారు.

## కుస్తీ పోటీ విజేతలకు సన్మానం

సికింద్రాబాద్, జూన్ 9: మారుతి వ్యాయామశాలలో వ్యాయామం చేస్తూ రాష్ట్ర, జిల్లా స్థాయిలో జరిగిన కుస్తీ పోటీల్లో గెలుపొందిన పవన్‌కుమార్, గణేశ్‌లను పలువురు సన్మానించారు. సోమవారం మైలార్‌గడ్డలోని మారుతి వ్యాయామశాలలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారుతి వ్యాయామశాల సభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ..మైలార్‌గడ్డలోని మారుతి వ్యాయామశాల1946లో ప్రారంభం అయిందని, ఇందులో ఎంతో మంది వ్యాయామం చేసి జిల్లా, రాష్ట్ర స్థాయిలో బాడీ బిల్డింగ్ పోటీల్లో మెడల్స్ సాధించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో మొదటి వ్యాయామశాలలో సోమవారం జరిగిన కుస్తీ పోటీల్లో పవన్‌కుమార్, గణేశ్‌లు పాల్గొన్నారు. మైలార్ గడ్డ ప్రాంతంలో నివసించే వీరు జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో మెడల్స్ సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వ్యాయామశాల నిర్వాహకులు కుమార్, జలంధర్‌రెడ్డి, గౌడ్ శ్రీను, బ్యాంక్ రమేశ్, హరీశ్, శ్రీనివాస్, మాస్టర్ జగపతి, బుచ్చన్న, శంకర్ రావు, బుద్ధులన్న, ప్రతాప్, వినోద్‌లు వారిద్దరిని సన్మానించారు. వీరిని ఆదర్శంగా తీసుకొని వ్యాయామశాలలో ఎంతో మంది యువకులు రాణించాలన్నారు.



కుస్తీ పోటీల్లో గెలుపొందిన పవన్‌కుమార్, గణేశ్‌లను సన్మానిస్తున్న వ్యాయామశాల సభ్యులు

## చంద్రకళకు డాక్టరేట్



చిక్కడపల్లి,జూన్ 9: డాక్టర్ పంగులూరి చంద్రకళ సోమవారం అనురాగ్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (Ph.D.) డిగ్రీని అందుకున్నారు. ఆమె గణితశాస్త్ర విభాగంలో డాక్టర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో స్టడీ ఆఫ్ ఎంహెచ్‌డీ కన్వెక్టివ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ ఫ్లో ఆఫ్ హైబ్రిడ్ నానో ఫ్లూయిడ్స్ అనే వినూత్న అంశంపై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పరిశోధన ఇంజినీరింగ్ రంగంలో, ముఖ్యంగా సౌరశక్తి, వేడి తగ్గించే పరికరాల తయారీ వంటి వాటిలో ఉపయోగపడుతుందని తెలిపారు. చంద్రకళకు డాక్టరేట్ రావడంపట్ల ఆమె తల్లి దండ్రులు శ్రీరామచంద్రమూర్తి, సుభద్రలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## జలమండలిలో ట్రేడ్ యూనియన్ లకు ఎన్నికలు నిర్వహించాలి

### - పలు సంఘాల నాయకులు

చిక్కడపల్లి,జూన్ 9: జలమండలిలో ట్రేడ్ యూనియన్‌లకు ఎన్నికలు నిర్వహించాలని పలు సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ బీ2898, టీఎంయూ–బీ 2706, ఎంహెచ్‌డబ్ల్యూ, ఎస్సీబీ –315, డబ్ల్యూ, డబ్ల్యూ యూ 2873, హెచ్‌ఎండబ్ల్యూ ఎస్ఎస్ బీయూ బీ–1929, తదితర సంఘాల ప్రతినిధులు సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (JCL) సునీతను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు సతీశ్‌కుమార్, వాటర్ వర్క్స్ యూనియన్ అధ్యక్షుడు రాజారెడ్డిలు మాట్లాడుతూ.. గత సంవత్సరం మే నెలలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తామన్న అధికారులు నేటికి పూర్తి చేయలేదని తెలిపారు. ఇప్పటికీ ఎలాంటి స్పష్టత లేకపోవడం వల్ల ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని తెలిపారు. వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ల నాయకులు ఎండీ జాంగీర్, శ్రవణ్‌కుమార్, రాఘవేంద్ర రాజ్, చంద్రశేఖర్, దేవేందర్, లక్ష్మణ్ కుమార్, రమేశ్, ఎం.రాజా, అజయ్ నాథ్, శంకర్ ప్రకాశ్, రాజు రాంచందర్ బి.మహేశ్ పాల్గొన్నారు.